సాక్షి సూర్యాపేట

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



మహిళలను గౌరవించాలి

పనిచేసే చోట మహిళలను గౌరవించాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. - 8లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్య కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. - 8లో



బీజేపీ సీనియర్ నేత దుర్మరణం

నల్లగొండ పట్టణంలో రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రాములు మృతిచెందారు. - 8లో

న్యూస్‌రీల్

గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ భవానీని శనివారం గిరిజన గురుకుల సొసైటీ అధికారులు సస్పెండ్ చేశారు. పాఠశాలలో రెండేళ్లుగా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, వారి ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో వివిధ రకాల సమస్యలను ఎదుర్కొన్నారు .ఈ విషయంపై గతంలో ఫిర్యాదులు రావడంతో గురుకుల సొసైటీ అధికారులు విచారణ చేపట్టారు . విచారణ నివేదికను సొసైటీకి అందజేయడంతో ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తప్పించినట్లు అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



చెస్ సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేటటౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణంలో శనివారం రాష్ట్ర స్థాయి చెస్ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెలక్షన్స్ జిల్లా కేంద్రంగా రెండు రోజుల పాటు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రీడల్లో అండర్ 19 బాయ్స్, గర్ల్స్ చెస్ పోటీల్లో పాల్గొంటారని, ఈ ఆటల్లో విజేతలు నిలిచిన వారిని అహ్మదాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి నేషనల్ గేమ్స్ పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్ సతీష్ కుమార్, సంజయ్, వెంకట మురళి, లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులు సాయికుమార్, జానయ్య, కుక్కడపు సాలయ్య భిక్షం, కొప్పు సందీప్ కళ్యాణ్ వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బూర మల్సూర్‌గౌడ్



బూర మల్సూర్‌కు నియామకపత్రం అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

భానుపురి (సూర్యాపేట) : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకేంద్రానికి చెందిన బూర మల్సూర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా బూర మల్సూర్‌కు నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మల్సూర్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మా, వరికుప్పల మధు, సాధనందం, గణేష్ , భారత్, భాస్కర్, వినయ్ పాల్గొన్నారు.

● జోహార్ వైఎస్సార్



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా హుజూర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నీరా శిక్షణ కేంద్రానికి ధర్మ భిక్షం పేరు పెట్టాలి

దురాజ్‌పల్లి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నీరా ఉత్పత్తి, శిక్షణ కేంద్రానికి బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. నీరా కోసం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించిన మహనీయుడి పేరు పెట్టడం వల్ల సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్పొరేషన్ ద్వారా కార్మికులకు లోన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు బండారు లక్ష్మయ్య, రేగటి లింగయ్య, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అనంతుల జానయ్య, అనంతుల మల్లేశ్వరి, కప్పల శశిరేఖ, దేశగాని వెంకన్న, అండం అంజయ్య, అయితగాని కామేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొమ్మగాని శ్రీనివాస్

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నాగారం : వచ్చే నెల 1వతేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. నాగారం, వర్థమానుకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదును 100శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, డీటీ షాహిన్ బేగం, ఆర్ఐ నర్సింహారావు, సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య ఉన్నారు.

ఉత్తమ గురువులు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా తొమ్మిది మంది ఎంపిక

● సూర్యాపేట జిల్లా నుంచి నలుగురు ● యాదాద్రి నుంచి ముగ్గురు ● నల్లగొండ నుంచి ఇద్దరు



బాలికల విద్యాభివృద్ధికి కృషి



దుస్తులు పంపిణీ చేస్తున్న అరుణశ్రీ (ఫైల్)



అరుణశ్రీ

రామగిరి(నల్లగొండ) : బాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. తిప్పర్తి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తగరం అరుణశ్రీ. 2000 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయులిగా ఆమె ఉద్యోగంలో చేరారు. 2009లో ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. 2013 నుంచి 2015 వరకు జిల్లా బాలికల అభివృద్ధి అధికారిగా పని చేశారు. 2017-18లో తిప్పర్తి ఇన్‌చార్జి ఎంఈఓగా పని చేయడంతో పాటు జిల్లా సెక్టోరియల్ (కేజీబీవీ) అధికారిగా పని చేశారు. బాలికల విద్య కోసం, బడి బయట ఉన్న బాలికలను పాఠశాలల్లో చేర్పించారు. 2021 నుంచి తిప్పర్తి బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్యను 49 నుంచి 117కు పెంచారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ఏర్పాటుకు కృషి చేశారు. దాతల సహకారంతో పాఠశాలకు రంగులు, గోడలపైన చిత్రాలు వేయించారు. కంప్యూటర్ లాబ్‌ను ఆధునీకరించారు. వినాయక చవితి ప్రాముఖ్యతను తెలియజేసేలా విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారు చేయించేవారు. విద్యానిధి ఏర్పాటు చేసి పాఠశాల ఉపాధ్యాయుల నుంచి నిధులు సేకరించి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేస్తున్నారు. 2022 పదో తరగతి ఫలితాల్లో 100 శాతం, 2023లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆమె సేవలకు గాను ఇప్పటికే ఎన్నో అవార్డులు వరించాయి.

ఆకట్టుకునేలా బోధన



కె.నాగయ్య

మద్దిరాల : కళారూపాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేస్తున్నా మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న కె.నాగయ్య. ఆయన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనకు తెలుగు అంటే మక్కువ. కళలంటే అంతకంటే ఎక్కువ. వివిధ కళారంగాలను పోషిస్తూ అందులో లీనమై విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించేవారు. తెలుగు బోధించేటప్పుడు రావణుడు, దుర్యోధనుడిలాంటి పాత్రలు పాఠాల్లో వచ్చినప్పుడు అందులో ఇమిడిపోయి బోధించేవారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో జరిగిన కార్యక్రమంలో రావణబ్రహ్మ ఏకపాత్రా అభినయం చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

సాంకేతిక పద్ధతులతో..



బి.జయరాజ్

చౌటుప్పల్ : నూతన సాంకేతిక పద్ధతులతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు.. చౌటుప్పల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బాణాల జయరాజ్. ప్రయోగాత్మకంగా, ఐఎఫ్‌బీ బోర్డుల ద్వారా పాఠాలు బోధిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. జయరాజ్ విద్యాబోధనలతో కూడిన 750 వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. అలాగే పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఫ్లోరైడ్ మహమ్మారి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. ఫ్లోరైడ్ నిర్మూలన, అవగాహన అంశాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన చేశారు.

ఓ వైపు బోధన.. మరోవైపు సేవ



హరితహారంలో మొక్కలు నాటుతున్న నర్సింహారెడ్డి



నర్సింహారెడ్డి

నల్లగొండ : పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన చేస్తూనే.. మరోవైపు సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు నల్లగొండలోని మాధవనగర్‌లోగల ప్రభుత్వ జేబీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రేపాక నర్సింహారెడ్డి. వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి 1995లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందారు. 28 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే సేవా కార్యక్రమాల నిర్వహించి పలు అవార్డులను పొందారు. నేషనల్ గ్రీన్ క్రాఫ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలన్నీ విజయవంతం చేయడంతో అప్పటి కలెక్టర్ ముక్తేశ్వరావు నుంచి అభినందనలు పొందారు. బడిబాట కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచారు. హరితహారం, వన మహోత్సవం కార్యక్రమాల్లో కూడా సేవలందించి అభినందనలు పొందారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేయించడం, నల్లగొండ బాలుర పాఠశాలలలో పని చేసిన సందర్భంలో విద్యార్థులకు దాతల సహకారంతో ప్లేట్లు అందించడం, పాఠశాలలో సంస్కృతిక, వకృత్వ, డ్రాయింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు బహుమతులు పొందేవిధంగా కృషి చేశారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి



టీఎల్‌ఎం మేళాలో వెంకటరామనర్సమ్మ (ఫైల్)



వెంకటరామనర్సమ్మ

తుంగతుర్తి : అభ్యసన సామర్థ్యాలు మెరుగు పర్చడంలో విశేష కృషి చేశారు తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకటరామనర్సమ్మ. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 98 అడ్మిషన్లు చేయించారు. తద్వారా విద్యార్థుల సంఖ్య 277కు చేరింది. పాఠశాలలో ట్రిబుల్ ఆర్‌ను అమలు చేశారు. తద్వారా 80శాతానికిపైగా అభ్యసన సామర్థ్యాలు సాధించగలిగారు. విద్యార్థులతో బాల సంఘాలు ఏర్పాటు చేయించారు. ప్రతి పండుగకు విద్యార్థులతో వివిధ వేషధారణలతో నాటకాలు ప్రదర్శించడం ద్వారా వాటి ప్రాముఖ్యతను తెలియజేసేవారు. ప్రతినెలా ఎస్‌ఎంసీ సమావేశాలు నిర్వహించి పాఠశాల అభివృద్ధిపై చర్చించేవారు.

పేద పిల్లలకు చేయూత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జీవన్‌లత (ఫైల్)



జీవన్‌లత

రామన్నపేట : విద్యార్థులకు బోధన చేస్తూనే మరోవైపు పేదపిల్లల ఆలనాపాలనా చూస్తున్నారు.. రామన్నపేట (జనంపల్లి) బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు సురభి జీవన్‌లత. 2015 నుంచి రామన్నపేట పాఠశాలలో గణితం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలకు సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరిగేలా సరళమైన పద్ధతుల్లో బోధిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. అలాగే పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్‌ను సొంత డబ్బులతో కొనుగోలు చేసి అందజేస్తున్నారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు పని చేయకపోయినా సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తున్నారు. సొంత డబ్బులతో పాఠశాలలో కళావేదిక నిర్మిస్తున్నారు.

పాఠశాల అభివృద్ధి.. సామాజిక సేవ



పాఠశాలలో వైద్యశిబిరం (ఫైల్)



హర్షవర్ధన్‌రెడ్డి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూనే మరో వైపు సామాజిక సేవ చేస్తున్నారు. మోత్కూర్ మండలం దత్తప్పగూడేనికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి 11 సంవత్సరాలుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి పాఠశాలను హరితవనంగా తీర్చిదిద్దినందుకు రెండేళ్ల క్రితం స్వచ్ఛ పురస్కారం దక్కింది. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తున్నారు.ఇటుక బట్టీల్లో పని చేసే కార్మికుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు. మౌలిక వసతులు కల్పించారు.

ప్రయోగాలతో పాఠాలు



మారం పవిత్ర



మొక్కలపై అవగాహన కల్పిస్తున్న పవిత్ర (ఫైల్)

గరిడేపల్లి : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు రూపకల్పన చేసి ప్రయోగాల ద్వారా బోధిస్తున్నారు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవ శాస్త్రం ఉపాధ్యాయురాలు మారం పవిత్ర. వ్యవసాయ పరికరాలు, ఇంటిపైకప్పు నుంచి వడేవేస్ట్ వాటర్‌తో మొక్కల పెంపకం, డిజిటల్ మైక్రోస్కోప్ ద్వారా పిల్లలకు మొక్కలు, పుష్పాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల ట్రైనింగ్, మాడ్యూల్స్ తయారీలో రచయితగా పని చేశారు. పర్యావరణ హితమైన సంచుల తయారీ, కలుపు మొక్కలతో ఆయుర్వేద మందుల తయారీ, బంకమట్టి, పేడ, కొబ్బరి పీచుతో కుండీల తయారీ ఇలా ఎన్నో ప్రయోగాలను చేస్తూ ఆదర్శంగా నిలిచారు. యూట్యూబ్ చానల్ ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ హైదరాబాద్ సాయంతో సైన్స్ పాఠాలను బోధిస్తున్నారు. డీడీ యాదగిరి విద్యాచానల్‌లో పాఠాలు ప్రసారం చేస్తున్నారు. ఆరు నుంచి 10వ తరగతి పిల్లలకు జీవశాస్త్రం క్యూ ఆర్ కోడ్ ద్వారా అందించేందుకు కావాల్సిన కంటెంట్ 60 వీడియోలను తయారు చేశారు. దూర విద్యలో 10వ తరగతి చదివే వారి కోసం సైన్స్అండ్ టెక్నాలజీ, హోం సైన్స్ పాఠ్యాంశాలను రాశారు.

దాతల సహకారంతో అభివృద్ధి



శ్రీనివాస్



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ (ఫైల్)

నూతనకల్: దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి కృషి చేశారు నూతనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్. ఈ స్కూల్‌లో 2015 నుంచి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారంతో రూ.32లక్షల వ్యయంతో విద్యార్థులకు కావాల్సి నోట్‌బుక్స్, బ్యాగులు, స్టడీ మెటీరియల్ అందించడమే కాకుండా పాఠశాలలో 150 డెస్క్ బెంచీలు సమకూర్చారు. తాగునీటి అవసరాలు తీర్చడానికి సంపు, మినీ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి నల్లాలు ఏర్పాటు చేయించారు. విద్యార్థుకు ప్లేట్లు గ్లాసులు అందజేశారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 225 అడ్మిషన్లు చేయించారు. దీంతో మొత్తం 550 మంది విద్యార్థులతో జిల్లాలోనే ఈ పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. 8, 9,10 తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకం కింద నగదు అందజేశారు. మూడేళ్లుగా 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 98 శాతం మంది ఉత్తీర్ణత సాధిస్తూ వస్తున్నారు. 2017లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాల అభివృద్ధికి శ్రమించడమే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు దోహదపడిందని దామెర శ్రీనివాస్ తెలిపారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నియంత పాలన కొనసాగిస్తున్నాడని, 18 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. రెండో ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ సమ్మెలోరెండో ఏఎన్‌ఎంల సంఘ నాయకురాలు లక్ష్మీబాయి, స్వప్న, రాధ, భారతి, స్వరూప, రజిని, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి. రాజారామ్ ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇన్నోవేషన్‌తో మేధోశక్తి పెరుగుదల

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఇన్నోవేషన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధో శక్తి పెరుగుతుందని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యా విభాగం ఆధ్వర్యంలో 23 మండలాల నుంచి మండలానికి ఒకటి చొప్పున ఇన్నోవేషన్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీ టిని అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకతతో పాటు మేధో శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరికరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



హుజూర్‌నగర్‌లో ఓటరు నమోదు అవగాహన ర్యాలీలో అధికారులు, ప్రజలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డితో కలసి పాల్గొని మాట్లాడారు. ఓటరు సవరణలో భాగంగా వచ్చిన ఫామ్ 6,7,8 దరఖాస్తులపై విచారణ జరిపి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి చకిలం రాజేశ్వర్ రావు, బీఆర్‌యస్ నుంచి సవరాల సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నుంచి ఆబిద్, యంఐయం నుంచి ఫరీద్ అహ్మద్ పాల్గొన్నారు.

వంద శాతం ఓటరు నమోదు చేయాలి

జిల్లాలో వంద శాతం ఓటరు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీలోని పోలింగ్ కేంద్రం 66లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వీరబ్రహ్మ చారి, తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలి

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లాలో అభివృద్ధి , సంక్షేమ పథకాల అమలు తీరుపై శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక,వెంకట్‌రెడ్డిలతో కలసి పాల్గొని మాట్లాడారు.గొర్రెల యూనిట్లకు జిల్లాలో 3,200 మంది లబ్ధిదారులు వాటా సొమ్ము చెల్లించగా ఇప్పటి వరకు 480 యూనిట్లు లబ్ధిదారులకు అందించామని త్వరలో మరో 700 యూనిట్లు అందించాలని సూచించారు.

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న కండక్టర్



డబ్బులను అందజేస్తున్న కంట్రోలర్

చిట్యాల: చిల్లర డబ్బులు తీసుకోకుండా మరచి పోయిన ప్రయాణికుడికి మిగిలిన డబ్బులు ఇచ్చి నిజాయితీని చాటుకున్నాడు ఆర్టీసీ కండక్టర్. చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన పోలేపల్లి లింగయ్య శనివారం గుండ్రాంపల్లి నుంచి నల్లగొండ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాడు. టికెట్ కోసం కండక్టర్‌కు రూ 500లు ఇవ్వగా చిల్లర లేక మిగిలిన డబ్బులు టికెట్‌పై రాశాడు. నల్లగొండలో బస్సు దిగిన లింగయ్య టికెట్‌పై రాసిన డబ్బులు తీసుకోకుండానే వెళ్లి పోయాడు. కొంత సేపటి తరువాత జ్ఞాపకం వచ్చి నల్లగొండ కంట్రోలర్ వద్దకు వెళ్లి విషయం తెలిపాడు. అప్పటికే కండక్టర్ టికెట్‌కు పోగా మిగిలిన డబ్బులను కంట్రోలర్‌కు అప్పగించి వెళ్లి తన నిజాయితీ చాటుకున్నాడు. లింగయ్య కంట్రోలర్ ద్వారా డబ్బులను తీసుకున్నాడు. కండక్టర్ నిజాయితీని ప్రజలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మేళ్లచెరువు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. ఈ ఘటన మేళ్లచెరువు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. కోదాడ పట్టణానికి చెందిన కొల్లోజు రమేష్ కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వృత్తి రీత్యా అతను మేళ్లచెరువుకు వచ్చి బైక్‌పై కిటికీ గ్లాసును పెట్టుకొని కోదాడ వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతడికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కోదాడ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని ..

భువనగిరి : బైక్ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామానికి చెందిన పిడుగు సత్తయ్య శనివారం భువనగిరి పట్టణానికి కూలి పని నిమిత్తం వచ్చారు. స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద ఉదయం రోడ్డు ప్రక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా బైకు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడిని వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రపోల్ నుంచి బండావత్‌తండాకు వెళ్లే దారిలో ఎన్‌ఎస్‌పీ కెనాల్ సమీపంలోగల పొలం దగ్గరలో సుమారు 35 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు లేత గోధుమ రంగు గల నిండుచేతుల చొక్కాతోపాటు మెడలో పూసలదండ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడు గత కొన్ని రోజులుగా సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి జొర్రిగల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ సీనియర్ నేత దుర్మరణం

- ఆటో ఢీకొని ఓరుగంటి రాములు మృతి
- నల్లగొండలో ప్రమాదం
- నివాళులర్పించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఓరుగంటి రాములు (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్, నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రాములు (75) మృతిచెందాడు. ఓరుగంటి రాములు శనివారం నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో రహదారి దాటుతున్న క్రమంలో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మిర్యాలగూడ రోడ్డులో ఎస్‌వీఆర్ గార్డెన్ కాంప్లెక్స్‌లోని డెంటల్ క్లీనిక్‌లో ఉన్న రాములును ఓ శుభకార్యానికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు పిలవడంతో రోడ్డు దాటుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

శోక సంద్రంలో పార్టీ శ్రేణులు

బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పార్టీ శ్రేణులు శోక సంద్రంలో మునిగిపోయాయి. నల్లగొండ పట్టణానికి చెందిన ఓరుగంటి రాములు ఎమర్జెన్సీ సమయంలో 1975లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లారు. మొదట జనతా పార్టీలో ఉన్న ఆయన బీజేపీకి తొలి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. 1980 నుంచి వరుసగా మూడు సార్లు ఉమ్మడి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందించారు. ఆ తరువాత 2005 తరువాత కొంత కాలం మరో మారు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. సుదీర్ఘకాలం బీజేపీలో కీలక నేతగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. నాలుగు సార్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేయడంతో పాటు 1982లో మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. అదే విధంగా 1985లో నల్లగొండ అసెంబ్లీ నుంచి బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. 1991లో మిర్యాలగూడ నుంచి పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయారు. కేంద్ర టెక్స్‌టైల్స్ బోర్డు మెంబర్‌గా కూడా పని చేశారు. సుదీర్ఘకాలం జనసంఘ్‌లో, ఆ తరువాత బీజేపీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందించారు. రాష్ట్ర నాయకులతో పాటు జాతీయ నాయకులతో ఓరుగంటి రాములుకు మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వయస్సు మీద పడినా నేటికి పార్టీ కార్యక్రమాలకు హాజరై తనవంతు పాత్ర పోషించేవారు. ఓరుగంటి రాములు దాదాపు 50 సంవత్సరాల పాటు జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి, అద్వానీ, అమిత్‌షా, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నల్లు ఇంద్రసేనారెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, చింతా సాంబమూర్తి తదితర నేతలతో వ్యక్తి గత సంబంధాలు ఉన్నాయి.

రేపు అంత్యక్రియలు...

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు కాగా, రెండవ భార్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మొదటి భార్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. ఇద్దరు కుమారులు నల్లగొండ పట్టణంలోనే వైద్య వృత్తిలో ఉన్నారు. మరో కుమారుడు హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడ్డారు. కుమార్తె అమెరికాలో ఉంటుంది. ఆమె రాగానే సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నివాళులర్పించిన ఎమ్మెల్యే కంచర్ల

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు మృతదేహానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, శనివారం మార్చురీలో పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మరణం చాలా బాధాకరమన్నారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గవర్నర్ దత్తాత్రేయ సంతాపం

ఓరుగంటి రాములు మృతికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓరుగంటి రాములు కుమారుడు వంశీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడిన గొప్ప వ్యక్తి అని, అలాంటి వ్యక్తి మరణించడం తనను తీవ్రంగా కలిచి వేసిందని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి రాములు పార్థీవ దేహానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెళ్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నాయకులు నాగం వర్షిత్ రెడ్డి, పోతెపాక సాంబయ్య , గార్లపాటి జితేంద్రకుమార్, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, గుండగోని గిరిబాబు, చర్లపల్లి గణేష్, పెరిక మునికుమార్ తదితరులు ఉన్నారు.

ఓరుగంటి రాములు మృతికి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నేతల సంతాపం

సాక్షి, హైదరాబాద్ : నల్లగొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు ఓరుగంటి రాములు మృతిచెందడంపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఓరుగంటి రాములు మృతి పట్ల ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలియజేశారు.



మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుతో ఓరుగంటి రాములు (ఫైల్)



హరియాణా గవర్నర్ దత్తాత్రేయతో ఓరుగంటి రాములు (ఫైల్)



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఓరుగంటి రాములు (ఫైల్)

ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి

దేవరకొండ: ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతిచెందింది. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో ఆలస్యంగా శనివారం వెలుగుచూసింది. సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కి చెందిన ఏలే అలివేలు(56) కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ ఒంటరిగా సొంత ఇంట్లో నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమారులుండగా వారు ప్రస్తుతం హైదారాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కాగా అలివేలు రెండు రోజుల క్రితం తన ఇంట్లో స్నానం ముగించుకొని వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న స్టూలు బలంగా తగలడంతో కాలు జారి కిందపడింది. దీంతో అలివేలు ముఖానికి తీవ్ర గాయమై మృతిచెందింది. అలివేలు ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో శుక్రవారం రాత్రి చుట్ట పక్కల వారు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉంది. స్థానికుల సమాచారం మేరకు సీఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాలు జారి కింద పడడంతోనే అలివేలు మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి అన్న గంజి వాసుదేవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ టౌన్ : విధి నిర్వహణలో ఉన్న ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ చింతల ప్రవీణ్‌రెడ్డిపై దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటగిరి వెల్లడించారు. మిర్యాలగూడ మండలం కాలువపల్లి గ్రామ శివారులో గల అటవీ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలింపును ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ చింతల ప్రవీణ్‌రెడ్డి అడ్డుకున్నారు. మట్టి తరలించేందుకు తీసుకువచ్చిన ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ భూక్య వీరభద్రుని, యజమాని సుబ్బారావు, అతడి బంధువు అమర్‌నాథ్‌లు కలసి ట్రాక్టర్‌ను ఎందుకు ఆపావంటూ విధి నిర్వహణలో ఉన్న ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ చింతల ప్రవీణ్‌రెడ్డిపై కర్రతో దాడి చేశాడు. ఈ విషయంపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గుంజ సుబ్బారావు, అతని బంధువు మన్నెం అమర్‌నాథ్, డ్రైవర్ భూక్య వీరభద్రులపై కేసు నమోదు చేసి అరెస్ట్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోలీసు పహారాలో నర్సింహులగూడెం

మునగాల: మునగాల మండలంలో సమస్యాత్మక గ్రామంగా పేరొందిన నర్సింహులగూడెంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పులీందర్ రెడ్డి హత్య కేసులో ఆరుగురికి కోర్టు యావజ్జీవ శిక్షతో పాటు రూ.మూడువేల జరిమానా విధించిన సంగతి విధితమే. శుక్రవారం నిందితులకు శిక్ష పడిన తర్వాత మునగాల పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతారణం కొనసాసగుతుంది. ఈ కేసులో ఫిర్యాదురాలైన పులీందర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి ఇంటి వద్ద ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు విధుల్లో ఉన్నారు.

ఆధిపత్య పోరులో 9మంది హత్య

1995 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ, సీపీఎం పార్టీల మధ్య ఆధిపత్య పోరులో 9మంది హత్యకు గురయ్యారు. వీరిలో ఐదుగురు సీపీఎం పార్టీకి చెందిన వారు కాగా నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారున్నారు. ఎనిమిది హత్య కేసుల్లో ఇరువర్గాల వారు రాజీ కుదుర్చుకోవడంతో నాటి నుంచి నేటి వరకు ఎవరికీ శిక్షలు పడలేదు. కానీ 2014జనవరి 30న ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురైన ఆనాటి సర్పంచ్ జూలకంటి పులీందర్‌రెడ్డి సంఘటనలో పోలీసులు మొత్తం 9మందిపై కేసు నమోదు చేశారు. నాటి నుంచి నేటి వరకు సాగిన విచారణలో మొత్తం 31మంది సాక్షులను కోర్టు విచారించింది. వీరిలో హత్య జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షిగా పడిమర్తి అబ్రహం కూడా ఉన్నారు. ఈ హత్యల పరంపర కొనసాగుతుండడంతో గ్రామంలో అనేకమంది గ్రామాన్ని వదలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. రెండు పార్టీల నుంచి సుమారు 50కుటుంబాలు గ్రామాన్ని వదలి వెళ్లాయి.

పనిచేసే చోట మహిళలను గౌరవించాలి

- సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, అధికారులు

సూర్యాపేట క్రైం : పనిచేసే చోట మహిళలను గౌరవించాలని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో లైంగిక వేధింపులకు సంబంధించి మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పోస్టర్‌ను అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ నాగభూషణంతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదులు ఇవ్వాలన్నారు. వేధింపుల నియంత్రణకు రాష్ట్ర పోలీసు మహిళా శిశు సంక్షేమం విభాగం ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ విభాగాల్లో టీమ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సామగ్రిని త్వరగా తరలించాలి

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన నూతన పోలీసు కార్యాలయంలో సేవలను త్వరగా ప్రారంభించాలని ఎస్పీ కోరారు. ఇందుకు సంబంధించి కార్యాలయ సామగ్రిని తరలించాలన్నారు. ఈ మేరకు నూతన పోలీస్ కార్యాలయంలోని అన్ని కార్యాలయాల గదులను పరిశీలించారు. అనంతరం అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కమిటీ ఏర్పాటు చేశారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి

రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, మహేష్, సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.రాష్ట్ర పోలీసు సంఘం అధ్యక్షుడు గోపి రెడ్డి శనివారం జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచందర్ గౌడ్, సభ్యులు అంజన్ రెడ్డి, వెంకన్న ఉన్నారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర,కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం ,పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ ,మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలుచెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బ్రహ్మాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు,దేవీసత్యప్రసాద్, అప్పలాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు , భక్తులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరాల పరిశీలన

నల్లగొండ : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పరిశీలించారు. శనివారం నల్లగొండ పట్టణంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయ సముదాయంలోని పోలింగ్‌స్టేషన్లు 83, 84, 85లను, మిర్యాలగూడ రోడ్‌లో గల ఆదిత్య పాఠశాలలో ఏర్పాటు చేసిన 170 పోలింగ్ స్టేషన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులందరిని ఓటరుగా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకుని 1 అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయేవారంతా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవి, తహసీల్దార్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం

నల్లగొండ : ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటర్ జాబితా మార్పులు, సవరణలు, తొలగింపుల దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శనివారం హైదరాబాద్ నుంచి అన్ని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లానుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్, హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్‌డీఓలు చెన్నయ్య, శ్రీరాములు, రవి, యూనిట్-2 డిప్యూటీ కలెక్టర్ దామోదర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

సంస్థాన్ నారాయణపురం: పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొరిగె ఇల్లయ్య చిన్న కుమారుడు నరేష్(26) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన నరేష్ ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించినారు. మృతుడు తండ్రి ఇల్లయ్య ఫిర్యాదు మెరకు ఎస్‌ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట మండల పరిధిలోని ఎర్కారం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట మండల పరిధిలోని సపావత్‌తండా ఆవాసం జేత్యా తండాకు చెందిన లునావత్ కిషన్ (50) బైక్‌పై రాజానాయక్ తండాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జనగాం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్ మృతి చెందాడు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

మఠంపల్లి: మండలంలోని భీల్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనులను శనివారం క్వాలిటీ కంట్రోల్ అధికారి లలిత తనిఖీ చేశారు. మండలంలోని భీల్యానాయక్‌తండా పరిధిలోని ఉపాధి కూలీలు చేసిన ఫీడర్‌చానల్‌ను పంట కాలువలను పరిశీలించారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ బుంగయ్య, ఫీల్డుఅసిస్టెంట్ తదితరులున్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి జిట్టా శ్యాం కుమార్

హుజూర్‌నగర్ : లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలని మండల న్యాయసేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్ అన్నారు. తద్వారా ఇరుపక్షాల మధ్య కక్షపూరిత వాతావరణం తొలగిపోయి స్నేహసంబంధాలు బలపడతాయని అన్నారు. శనివారం హుజూర్ నగర్‌లోని కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులు తమ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా ఇరుపక్షాలు విజయం సాధించినట్లు అవుతుందని చెప్పారు. దీనితో గెలుపు ఓటములు అనే ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు. లోక్ అదాలత్‌లో జారీ కాబడిన అవార్డుపై అప్పీలు చేసుకునే అవకాశమే లేదని చెప్పారు. అలాగే కోర్టుకు చెల్లించిన కోర్టు ఫీజులు కూడా తిరిగి కక్షిదారులకు చెల్లిస్తామని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ అవార్డు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని అన్నారు. లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ కావడానికి మీడియా కూడా తమ వంతు తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే లోక్ అదాలత్‌లో ఇప్పటికే 517 కేసులు రాజీ అయ్యాయని రూ 11 లక్షలు జరిమానాల రూపంలో కక్షిదారులు చెల్లించారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాస రావు, న్యాయ శాఖ సిబ్బంది శ్యాం కుమార్, సుశీల, విజయ భాస్కర్‌రెడ్డి, సోహైల్, సైదా నాయక్, రేణుకయ్య, నాగరాజు, హలీం పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR RENT

■ నల్లగొండ పట్టణం పద్మావతి కాలనీ నందు అన్ని వసతులు గల G+1 & Pent Houseతో 2 BHK ఇల్లు అద్దెకు ఇవ్వబడును. ప్లాట్ నెం. 22. సంప్ర॥ 7569462304, 9885524488 [Y-798261]

PLOT FOR SALE

■ శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్, నల్లగొండ ప్లాట్ నెం.29 107 గజాలు, 20 ఫీట్ల రోడ్డు ఈస్ట్ ఫేస్ 21.5" పొడవు 45 ఫీట్ల గల ప్లాట్ గజం 15 వేలకు అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్ర॥సెల్ : 9490528836 [Y-1124102]

Wanted

■ నల్లగొండ కలెక్టరేట్ ప్రక్కన ఇండియన్ ఆయిల్ బంక్‌లో పని చేయుటకు పంప్ బాయ్స్ మరియు గర్ల్స్ కావలెను. సంప్ర॥ 97033 33310 [YA-14992]

■ Wanted Diplomo Civil Holder for Working at Bank Valuers Office @ Suryapeta, 2 Wheeler Must Pref : Bank Valuer Asst,. Ph : 99899 76995 [V- 797306]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

■ గ్రామీణ ప్రాంతాలలో ప్యూరిఫైడ్ వాటర్ ప్రముఖ సంస్థలో పనిచేయడానికి సిబ్బంది కావలెను. అర్హత: ఎలక్ట్రీషియన్ / డిగ్రీ, స్థానిక జిల్లా వారికి ప్రాధాన్యత. ఫోన్ : 8143601441 [H-788302]

ప్రకటన కొంచెం! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
ఎకోలి : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పత్తిలో సూక్ష్మలోపాలు.. నివారణ చర్యలు



రాజగోపాల్‌రావు, వ్యవసాయాధికారి, నడిగూడెం



నడిగూడెం మండలం బృందావనపురం వద్ద సాగులో ఉన్న పత్తి

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుతం పత్తి మొక్కలు పెరిగే దశలో ఉన్నాయి. రైతులు ఒకే పొలంలో పంట మార్పిడి చేయకుండా పత్తినే సాగు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో మొక్కల్లో సూక్ష్మపోషకాల లోపాలు కనిపిస్తున్నాయని, ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజ గోపాల్‌రావు చెబుతున్నారు.

జింక్ లోపం

పత్తి మొక్కల్లో జింక్ లోపం కనిపిస్తే ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి వాటి మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. ఆకులు చిన్నవిగా ముడుతలు పడి ఉండి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్క గిడసబారుతుంది. ఒకే పంట సాగు చేయడంతో పాటు భాస్వరం ఎరువులు అధికంగా వాడటం, చౌడు భూములు కావడం, సహజసిద్ధంగా లోపం కలిగిన నేలలు దీనికి కారణం. దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 2 లేదా 3 సార్లు ప్రతి 5 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ భూమిలో వేయాలి.

మెగ్నీషియం

పత్తి మొక్కల్లో మెగ్నీషియం లోపిస్తే ముదురు ఆకుల అంచులు పసుపు రంగుకు మారుతాయి. తరువాత ఆకులు ఎర్రబడి ఎండిపోయి రాలిపోతాయి. ఆకుల ఈనెలు మాత్రం రంగు మారక ఆకుపచ్చగా ఉంటాయి. పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో ఈ లోపం కనిపిస్తుంది. లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి మొక్కలపై వారం పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

పూత, పిందె రాలడం

ప్రతికూల పరిస్థితుల్లో (అధిక తేమ లేదా బెట్ట) మొక్కల జీవన ప్రక్రియలో వచ్చే మార్పుల వల్ల పత్తిలో గూడ, పూత, పిందె రాలడం జరుగుతుంది. దీని నివారణకు ప్లానోఫిక్స్ (యన్.ఎ.ఎ.10 పీపీఎం) ద్రావణాన్ని 5 లీటర్ల నీటిలో 1 మి.లీ. చొప్పున కలిపి 10-15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. ప్లానోఫిక్స్‌ను విడిగా కానీ లేదా లీటరు నీటికి 20 గ్రాముల డీఏపీ లేదా యూరియా ద్రావణంతో కలిపి పిచికారీ చేస్తే ఫలితం బాగుంటుంది.

బోరాన్

పూత చిన్నగా మారడం, పూత, పిందె రాలడం, మొక్కలు గిడసబారి కాండంపై పగుళ్లు ఏర్పడడం జరుగుతుంది. ఈ లోపం సున్నం పాలు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితుల్లో, అధిక వర్షపాతం ఉన్నప్పుడు కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ కలిపి 1 లేదా 2 సార్లు 7-10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.